సాక్షి
నారాయణపేట

గురువారం : 26 : డిసెంబర్ : 2024



వంతెన కష్టాలు

చేగుంట రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ వంతెన లేక ప్రయాణికులు ఇక్కట్ల పాలవుతున్నారు.

వివరాలు 10లో ▸



ముగింపు దశకు..

కోస్గిలో జరుగుతున్న జాతీయ వాలీబాల్ పోటీలు ముగింపు దశకు చేరుకున్నాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.2 /18.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

మూడు రోజులు నీటి సరఫరా బంద్

నారాయణపేట: పట్టణానికి తాగునీరు అందించే మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్‌కు సింగారం చౌరస్తా దగ్గర లీకేజీ కావడంతో మూడు రోజుల పాటు తాగునీరు సరఫరాలో అంతరాయం కలుగుతుందని, ఇందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లీకేజీ మరమ్మతుల పనులు మున్సిపల్ ఇంజనీర్ మహేశ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయని, సాధ్యమైనంత త్వరలో తాగునీటి సరఫరా పునరుద్ధరణకు ప్రయత్నిస్తామని తెలిపారు.

ఇండియన్ అబ్జర్వర్‌గా ఎస్.వెంకటేశ్ నియామకం

నారాయణపేట: ఎస్‌జీఎఫ్‌ఐ ఎస్‌ఎస్‌జీ వాలీబాల్ అండర్ –19 బాలుర చాంపియన్ సిప్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహణకు ఇండియన్ అబ్జర్వర్‌గా నారాయణపేట డీవైఎస్‌ఓ వెంకటేశ్‌శెట్టిని నియమిస్తూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి.సురేశ్‌దోషి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని కోస్గిలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ ఇండియా జాతీయ స్థాయి అండర్ –19 బాలుర పోటీలకు ఆయన అబ్జర్వర్‌గా వ్యవహరించనున్నారు. ఈ పోటీల్లో 22 రాష్ట్రాలు, నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాలు , ఏడు నామినేటెడ్ విద్యా సంస్థల 33 జట్లు పాల్గొంటున్నాయి. ఈ పోటీలు గురువారంతో ముగియనున్నాయి.

ఉద్యోగ భద్రత కల్పించాలి



నారాయణపేట ఎడ్యుకేషన్: స్థానిక మున్సిపాల్ పార్క్ దగ్గర సమగ్ర శిక్ష ఉద్యోగులు 14వ రోజు నల్ల దుస్తులు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, పీవైఎల్ జిల్లా కార్యదర్శి ప్రతాప్, టీయూసీఐ జిల్లా కార్యదర్శి నరసింహా పాల్గొని వారికి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరి కాదని, వీరందరిని విద్యాశాఖలో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అదే విధంగా ఎన్నికలలో ఇచ్చిన హామీని నెరవేర్చలని డిమాండ్ చేశారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం..

మహబూబ్‌నగర్ రూరల్: మనస్మృతి వల్ల దళితులు అవమానాలకు గురై.. అణచివేయబడ్డారని, మెజార్టీ ప్రజలకు సర్వహక్కులు లేకుండా చేసిందని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ అన్నారు. మనస్మృతి– రాజ్యాంగం అనే అంశంపై కేవీపీఎస్, టీపీఎస్‌కే, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు భరత్ అధ్యక్షతన చర్చాగోష్టిలో ఆయన పాల్గొని మాట్లాడారు.

అభివృద్ధికి బాటలు..!



అంగన్‌వాడీ సెంటర్‌లో అందించిన పరికరాలపై ఆరా తీస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

- 'సంపూర్ణ అభియాన్'తో నర్వకు మహర్దశ
- ఉమ్మడి జిల్లాలో వెనుకబడిన ప్రాంతంగా మండలం ఎంపిక
- నీతి ఆయోగ్ ద్వారా మండల అభివృద్ధికి చేయూత
- ఆరోగ్యం, పోషణ, విద్య, మౌలిక వసతుల కల్పన
- మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి రూ.9.40 కోట్ల రుణాలు
- నేడు నర్వ మండలంలో కేంద్రమంత్రి పర్యటన



రాయికోడ్‌లో సంపూర్ణ అభియాన్ కింద అభివృద్ధి చేసిన మోడల్ అంగన్‌వాడీ-2 కేంద్రం

నర్వ: దేశంలో అత్యంత వెనకబడ్డ ప్రాంతాలను గుర్తించి వాటిని అభివృద్ధి బాట పట్టించేందుకు నీతి ఆయోగ్ జులై 4, 2022న సంపూర్ణ అభియాన్ అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా దేశంలో 500 వెనుకబడిన మండలాలను గుర్తించగా.. అందులో నర్వ మండలం ఆ జాబితాలో ఉంది. ఈ మండలం సమగ్ర అభివృద్ధి సాధించడం ద్వారా సంపూర్ణ ఉద్యమంగా మారాలని దృష్టిపెడుతుంది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఆరోగ్యం, పోషణ, విద్య, నీటి వసతి, పారిశుద్ధ్యం, వ్యవసాయం వంటి ఆరు ముఖ్యమైన సూచికలపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో అత్యంత వెనకబడ్డ ప్రాంతంగా గుర్తించబడిన నర్వ మండలాన్ని సంపూర్ణ అభియాన్ కార్యక్రమానికి నీతి ఆయోగ్ సంస్థ ఎంపిక చేసింది. ఈ కార్యక్రమం ద్వారా మండలంలో ఇప్పటి వరకు జరిగిన, చేపట్టిన పనుల రివ్యూ కోసం గురువారం కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ రానున్నారు.

మోడల్ అంగన్‌వాడీకి చర్యలు

నర్వ మండలాన్ని అత్యంత వెనకబడ్డ ప్రాంతంగా నీతి ఆయోగ్ సంస్థ సంపూర్ణ అభియాన్ కార్యక్రమానికి ఎంపిక చేసింది. జనవరి 7, 2023లో కార్యక్రమానికి ఎంపికైన మండలాల్లో మౌళిక వసతులు, లెర్నింగ్ స్కిల్స్ ఏర్పాటు కోసం అప్పటి కలెక్టర్ కోయ శ్రీహర్ష నర్వ మండలానికి రూ.4 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నిధుల ద్వారా మండలంలోని రాయికోడ్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని మోడల్ అంగన్‌వాడీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టింది. వాల్ పెయింటింగ్, గోడలపై చిత్రాలు, మ్యాప్‌లు, కిచెన్ గార్డెన్, ప్రీస్కూల్ కిట్స్, మంకీ బార్స్, బెడ్‌షీట్స్, ఈ పరికరాలను మండలంలోని 33 అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేశారు. ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు 6 జులై 2024 మండలంలోని అన్ని గ్రామాల్లో ర్యాలీలు, 19 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు.

ఆరు విభాగాల్లో..

మండలంలో ఆరు విభాగాలు ఆరోగ్యం, న్యూట్రిషియన్(పోషణ), అగ్రికల్చర్(వ్యవసాయం), విద్య(ఎడ్యుకేషన్), నీటి వసతి,, సోషల్ సెక్టార్, విభాగాలలలో వంద శాతం ఫలితాలు సాధించాలనే లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

- మూడు నెలల్లో 240 మంది గర్భిణులకు ఆరోగ్యం, పోషణ వంటి కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించారు.
- మండలంలో 21,405 మందికి బీపీ, షుగర్(మధుమేహం) పరీక్షలు, నిర్వహించారు.
- సంపూర్ణ అభియాన్ కార్యక్రమం ద్వారా తక్షణ అవసరంగా గుర్తించి నర్వ పీహెచ్‌సీకి అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు.
- అగ్రికల్చర్ విభాగంలో సంపూర్ణ అభియాన్ ద్వారా రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ ఆదేశాల మేరకు 7145 ఆరోగ్య మట్టి పరీక్షల కార్డులను అందజేశారు. దీంతోపాటు 3,200 మట్టి నమూనాలను పరీక్షల కోసం వికారాబాద్ జిల్లా ల్యాబ్‌కు వ్యవసాయ శాఖ అధికారులు పంపించారు.
- సోషల్ సెక్టార్ కింద స్వయం సహాయక మహిళా సంఘాలకు మండల వ్యాప్తంగా రూ.9.40 కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలను అందించారు.
- ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా బాలామృతం, పౌష్టికాహారం తీసుకొని పోషణ విభాగంలో మంచి ఫలితాలు సాధించిన కుటుంబాలను స్వాతంత్ర్య వేడుకలకు ఢిల్లీ పంపించి రాష్ట్రపతి భవన్, మొగల్‌గార్డెన్స్, ఎర్రకోట ప్రాంతాలను పర్యటించేలా చర్యలు తీసుకున్నారు.

ప్రత్యేక కార్యక్రమాలు..



నీతి ఆయోగ్ సంస్థ చేపట్టిన సంపూర్ణ అభియాన్ కార్యక్రమానికి అత్యంత వెనకబడ్డ నర్వను ఎంపిక చేయడం అభినందనీయం. ఈ కార్యక్రమం ద్వారా ఆరు విభాగాల్లో వంద శాతం వృద్ధి చేసేలా మూడు నెలల పాటు కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా మండల అభివృద్ధికి దోహదం కానుంది. మండలంలోని రాయికోడ్ గ్రామంలో మోడల్ అంగన్‌వాడీ–2 కేంద్రాన్ని, వెల్‌నెస్ సెంటర్, పాఠశాలలో చేపట్టిన పనులపై ఈ నెల 26న కేంద్రమంత్రి పరిశీలించనున్నారు.

– శ్రీనువాసులు, ఎంపీడీఓ, సంపూర్ణ అభియాన్ నోడల్ అధికారి

మూడు నెలల ప్రగతి పరిశీలించేందుకే..

సంపూర్ణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి జిల్లాలో అత్యంత వెనకబడ్డ ప్రాంతాలైన నారాయణపేట, గద్వాల జిల్లాల్లోని నర్వ, గట్టు మండలాలను ఎంపిక చేశారు. ఇందులో బాగంగా జిల్లాలోని నర్వ మండలాన్ని ఎంపిక చేసి మూడు నెలల పాటు ఆరు విభాగాల్లో వంద శాతం వృద్ధి చేసేలా కలెక్టర్ చైర్మన్‌గా జిల్లా, మండల నోడల్ అధికారులుగా పర్యవేక్షించి చర్యలు చేపట్టాం. ఇందులో రాయికోడ్ గ్రామంలో చేపట్టిన పనులను సమీక్షించేందుకు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఈ నెల 26న, రానున్నారు.

– మొగులయ్య, డీఆర్డీఓ, నారాయణపేట



రాయికోడ్‌లో ఏర్పాట్లపై సమీక్షిస్తున్న డీఎస్పీ లింగయ్య

కేంద్ర మంత్రి పర్యటన భద్రతా ఏర్పాట్ల పరిశీలన

నర్వ: నీతి ఆయోగ్ కార్యక్రమంలో భాగంగా నర్వ మండలం రాయికోడ్ గ్రామాన్ని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పర్యటించనున్న నేపథ్యంలో డీఎస్పీ లింగయ్య స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పరిశీలించనున్న అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ కార్యాలయం, పీహెచ్‌సీ సబ్ సెంటర్‌లను ఆయన పరిశీలించారు. భద్రతాపరమైన సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనువాసులు, ఇతర శాఖల అధికారులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులున్నారు.



సింగారం చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

ఆనందోత్సాహాలతో..

జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. బుధవారం కుటుంబ సమేతంగా చర్చిలకు చేరుకొని సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పాస్టర్లు సందేశాలు వినిపిస్తూ.. ప్రేమ, దయ, శాంతి, సహనం కలిగి ఉండే సుగుణాలే ఏసు క్రీస్తు మార్గమని.. మానవాళిని రక్షించడానికి ఏసు జన్మించారని.. ఏసు మార్గం అనుసరణీయమన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు వేడుకల్లో పాల్గొని క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

– నారాయణపేట



సైన్స్ ల్యాబ్‌లకు నిధులు

- ఉమ్మడి జిల్లాలో 46 జూనియర్ కళాశాలలకు నిధులు విడుదల
- ఫిబ్రవరిలో ఇంటర్ ప్రయోగ పరీక్షలు



బాలుర జూనియర్ కళాశాలలో ఫిజిక్స్‌ల్యాబ్ పరికరాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ భగవంతాచారీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యాసంవత్సరం దాదాపు ముగింపు దశకు రావడంతో ప్రభుత్వం సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలపై దృష్టి సారించింది. ఫిబ్రవరి మొదటి వారంలో ప్రయోగ పరీక్షలు జరగనున్నారు. ఈ క్రమంలో ఈనెల చివరి వారం నుంచి విద్యార్థులను సైన్స్ ప్రాక్టికల్స్‌కు సన్నద్ధం చేయాల్సి ఉంది. అందుకోసం ప్రభుత్వ కళాశాలల్లో ఉన్న ల్యాబ్‌లలో వసతులు, సైన్స్ పరికరాలు, కెమికల్స్, రీఏజెంట్స్ వంటివి కొనేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు ఒక్కో కళాశాలకు రూ.25 వేల చొప్పున విడుదల చేసింది. చివరి సారిగా 2018–2019 విద్యాసంవత్సరంలో ల్యాబ్‌లలో వసతులు కల్పించేందుకు నిధులిచ్చారు. దాదాపు ఐదేళ్లుగా నిధులు విడుదల చేయకపోవడంతో ప్రయోగశాలల పరిస్థితి దారుణంగా మారింది. చాలా విలువైన సైన్స్ పరికరాలు పాడైపోయాయని పలువురు సైన్స్ అధ్యాపకులు పేర్కొంటున్నారు. ప్రతి ఏడాది నిధులు విడుదల చేస్తే నిర్వహణ సులువుగా జరుగుతుందన్నారు.

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా మొత్తం 46 ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉంటే వాటికి రూ.11.50 లక్షలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీకి సంబంధించి ఏఏ పరికరాలు, కెమికల్స్ అవసరమో వాటికి సంబంధించిన ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ లెక్కలు తీసుకున్నారు. గతంలో ఉన్న చాలా పరికరాలు పాడైపోయినట్లు గుర్తించారు.

ప్రతిపాదనలు పంపించాం..



కళాశాలల్లో ఉన్న ల్యాబ్‌లకు ప్రభుత్వం రూ.25 వేలను ఇటీవల విడుదల చేసింది. ఇందులో భాగంగా కళాశాలలో ఉన్న ల్యాబ్‌లలో అవసరమైన పరికరాల లెక్కలు తేల్చి, మెటీరియల్ సరఫరా ఏజెన్సీలకు ప్రతిపాదనలు పంపించాం. మెటీరియల్ వచ్చాక ఫిబ్రవరి మొదటి వారంలో ప్రయోగ పరీక్షలుకు విద్యార్థులను సన్నద్ధం చేస్తాం.

– భగవంతాచారి, ప్రిన్సిపాల్, బాలుర జూనియర్ కళాశాల

నిధులు వచ్చాయి..



ప్రభుత్వ కళాశాలలలో ల్యాబ్స్‌లో వసతులు కల్పించేందుకు ప్రభుత్వం రూ.25 వేల చొప్పున కళాశాల ఖాతాలో జమ చేసింది. వీటిని కళాశాల స్థాయిలో కమిటీ ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేసి కొనుగోలు చేయాల్సి ఉంది. ఈ నెలాఖరు నుంచి విద్యార్థులకు ప్రయోగ విద్యను అందించి ఫిబ్రవరిలో జరిగే పరీక్షలకు సిద్ధం చేస్తాం.

– కౌసర్‌జహాన్, డీఐఈఓ, మహబూబ్‌నగర్

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కళాశాలలు

జిల్లా	ప్రభుత్వ కళాశాలలు	నిధులు (రూ.లక్షల్లో)
మహబూబ్‌నగర్	10	2.50
జోగుళాంబ గద్వాల	8	2
నారాయణపేట	8	2
నాగర్‌కర్నూల్	10	2.50
వనపర్తి	10	2.50

తాగి నడిపితే.. కటకటాలే

నుక్కేసినోళ్ల చేత ఊచలు లెక్కపెట్టిస్తున్న పోలీసులు

- జిల్లాలో విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు
- ఆరుబయట మద్యం తాగే వారిపైనా ప్రత్యేక దృష్టి
- న్యాయస్థానాల్లో హాజరుపరుస్తూ.. జైలుశిక్ష, జరిమానా విధింపు
- మరోవైపు అవగాహన సదస్సులతో ప్రజల్లో చైతన్యం



గత ఆరేళ్లలో డ్రంకెన్ డ్రైవ్ కేసులు, జైలుశిక్ష పడినవారు ఇలా..	2019	2020	2021	2022	2023	2024
నమోదైన కేసులు	1,155	994	3,057	7,046	6,576	2,578
జైలుశిక్ష పడినవారు	258	178	12	15	52	15

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారి పట్ల పోలీసులు ఇటీవల కాలంలో కఠినంగా వ్యవహరిస్తున్నారు. బ్రీత్ అనలైజర్ టెస్టుల్లో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి.. కోర్టులో హాజరుపరుస్తూ జైలుశిక్ష, జరిమానాలు విధించేలా చూస్తున్నారు. రహదారి ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించడంలో భాగంగా ప్రత్యేక ప్రణాళికతో వెళ్తున్న పోలీసు యంత్రాంగం డ్రంకె న్ డ్రైవ్ పరీక్షలను సమర్థవంతంగా వినియోగించుకుంటోంది. ఒకవైపు ట్రాఫిక్ నిబంధనలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూనే.. మరోవైపు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేపడుతూ అందులో పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. అలాగే ఆరుబయట మద్యం తాగే వారిపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తూ కట్టడికి చర్యలు చేపడుతున్నారు.

విస్తృతంగా అవగాహన సదస్సులు

మద్యం తాగి వాహనాలు నడిపితే కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా అటు వాహనదారులు.. ఇటు ప్రయాణికులకు పోలీసులు విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. కొన్నిరోజులుగా సాగుతున్న ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు, వాటిని అతిక్రమిస్తే తీసుకునే చట్టపరమైన చర్యల గురించి వివరిస్తూ చైతన్యం కల్పిస్తున్నారు. జైలుశిక్ష, జరిమానా వంటి చర్యలతోపాటు అవగాహన సదస్సులతో చైతన్యం కల్పిస్తుండటం వల్ల ఇటీవల కేసుల నమోదు గణనీయంగా తగ్గిందని చెప్పవచ్చు.

ఆన్‌లైన్ ద్వారానే..

వాహనాల తనిఖీల సమయంలో బ్రీత్ అనలైజర్ ద్వారా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తారు. తనిఖీల్లో పట్టుబడిన వారు గతంలోనైతే డిపార్ట్‌మెంట్‌లో తెలిసిన వారితో.. లేదా పలుకుబడి ఉన్న వారితో ఫోన్ చేయించి వదిలించుకునే ప్రయత్నం చేసేవారు. ప్రస్తుతం డ్రంకెన్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడిన వెంటనే వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి, మద్యం తాగిన వాహనదారులను వారి గమ్యస్థానాలకు పంపించి వేస్తారు. చార్జిషీట్ నమోదు చేసి కేసును న్యాయస్థానానికి పంపిస్తారు. కేసు తీవ్రతను బట్టి రూ.4 వేల పైవరకు జరిమానాతోపాటు జైలుశిక్ష విధించే అవకాశం ఉంది.

ప్రత్యేక బృందాలతో తనిఖీలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి డ్రంకెన్ డ్రైవ్ కేసులు గణనీయంగా పెంచాం. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రాణనష్టంతోపాటు క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు. దీనిని చాలా వరకు కట్టడి చేయడానికి తనిఖీలు విస్తృతం చేశాం. దీంతోపాటు జాతీయ రహదారిపై స్పీడ్ గన్ కేసులు రోజుకు 75 నమోదు చేస్తున్నాం. రాబోయే డిసెంబర్ 31 వేడుకలకు సంబంధించి మొత్తం 10 బృందాలతో పాలమూరు పట్టణంలో తనిఖీలు చేపడతాం.

– వెంకటేశ్వర్లు, డీఎస్పీ

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

నారాయణపేట: సైబర్ నేరగాళ్ల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. మోసపూరిత ఆశలకు గురికారాదని ఎస్పీ యోగేష్ గౌతమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం అనేక రకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారని, అధిక లాభాల కోసం ఆశపడి ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టరాదని, ఠీఠీఠీ.ఛి ఞ్టఛిటజీఝ్ఛ.జౌ ఠి.జీ ఽ) లో ఫిర్యాదు చేస్తే సంబంధిత పోలీస్ స్టేషన్ వారు తక్షణమే స్పందిస్తారని తెలిపారు. ఎవరైనా కొత్త వ్యక్తులు క్యూఆర్ కోడ్ పంపించి దాన్ని స్కాన్ చేస్తే మీకు డబ్బులు వస్తాయని చెబితే నమ్మవద్దని, అది సైబర్ మోసం అని గ్రహించాలని తెలిపారు. ఏదైన ఆన్‌లైన్ లోన్‌ను యాప్ ద్వారా తీసుకున్న సందర్భంలో వారు ఫొన్ నెంబర్లు ఫొటోలు వ్యక్తిగత వివరాలు మీ అనుమతి లేకుండా తీసుకుంటారని, మీరు తీసుకున్న లోన్ తిరిగి కట్టిన ఎక్కువ డబ్బులు కట్టమని ఆ వివరాలతో వేధింపులకు గురి చేస్తుంటారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితి ఎదురైతే వెంటనే 1930కి లేదా డయల్ 100 కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కస్టమర్ కేర్ నెంబర్ సంబంధిత వెబ్ సైట్ నుంచి మాత్రమే తీసుకోవాలని, సైబర్ నేరగాళ్లు గూగుల్ నందు నకిలీ కస్టమర్ కేర్ నెంబర్ నుంచి సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు.

'అదనపు ఆయకట్టుకు సాగునీరందిస్తాం'



కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో పూలు చల్లుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కింద పూర్తయిన గ్రావిటీ కెనాల్, అజిలాపురం, చౌదర్‌పల్లి లిఫ్ట్‌లను నిర్మించి రాబోయే రోజుల్లో ప్రాజెక్టు కింద అదనపు ఆయకట్టుకు సాగునీరందిస్తామని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా యాసంగి పంటలకు సాగునీటిని విడుదల చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో లిఫ్ట్‌ల గురించి ప్రస్తావించానని, సీఎం, మంత్రులు, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారి స్పందన మేరకే అజిలాపురం లిఫ్ట్‌కు మంగళవారం ఆర్థిక అనుమతులు లభించాయని, రెండు రోజుల్లో జీఓ కూడా తీసుకువచ్చి పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ లిఫ్ట్ ద్వారా అజిలాపురం , గద్దెగూడెం, వెంకటాయపల్లి గ్రామాలకు, చౌదర్‌పల్లి లిఫ్ట్‌తో లక్ష్మీపల్లి, హాజిలాపూర్, చక్రాపూర్, వేముల తదితర గ్రామాలకు సాగు నీరందుతుందన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, అప్పటి మంత్రి హరీశ్‌రావు కోయిల్‌సాగర్‌కు వచ్చి 50 వేల ఎకరాల అదనపు ఆయకట్టుకు నీరందిస్తామని ప్రగల్భాలు పలికి రైతులను మోసం చేశారని ఆరోపించారు. ఐడీబీ సమావేశం ఏర్పాటు చేసి రైతుల కోరిక మేరకు వారికి అనుకూలమైన తేదీలను పరిగణలోకి తీసుకుని నీటిని విడుదల చేశామన్నారు. గతంలో సకాలంలో నీటిని విడుదల చేయకుండా రైతులను ఇబ్బందికి గురి చేశారని, ఇప్పుడు అలాంటి పరిస్థితి రాదన్నారు. ప్రస్తుతం కుడి, ఎడమ కాల్వల ద్వారా పాత ఆయకట్టుకు నీరందుతుందన్నారు. ఒకవేళ మధ్యలో నీరు సరిపోకపోతే జూరాల నుంచి లిఫ్ట్ ద్వారా తెచ్చి అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్, డీఈ చందు, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌రెడ్డి, దేవరకద్ర, కౌకుంట్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు

- పెద్దచెరువు వద్ద మళ్లింపు కాల్వకు చేరుతున్న వైనం
- పట్టణంలోని ఓపెన్ నాలాల నుంచి కొట్టుకొస్తున్న డబ్బాలు
- నిత్యం క్వింటాల్ మేర తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

– మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ



– వివరాలు 8లో..

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

భూత్పూర్: పట్టణంలోని జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన దీప్‌మాన్ సింగ్ (40) పట్టణ సమీపంలోని హోటల్‌లో వంటల మాస్టర్‌గా పనిచేస్తుండేవాడు. కొన్ని రోజులుగా విధులకు దూరంగా ఉన్న ఆయన మంగళవారం రాత్రి హోటల్ వద్దకు రాగా ఉండటంతో మూసి ఉంది. దీంతో నడుచుకుంటూ భూత్పూర్ చౌరస్తాకు వస్తుండగా వెనుక నుంచి వచ్చిన వాహనం ఢీకొట్టడంతో రోడ్డు పక్కకు దూరంగా పడిపోయాడు. బుధవారం ఉదయం అటుగా వెళ్తున్న రైతు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మరో వ్యక్తి..

వనపర్తి రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన వనపర్తి మండలం రాజపేట గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. రాజపేటకు చెందిన దుప్పటి కుర్మన్న (57) వనపర్తి వైపు నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తుండగా.. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రూరల్ ఎస్ఐ జలేందర్‌రెడ్డి తెలిపారు.

ఆటో కిందపడి బాలుడు..



మిడ్జిల్: ఆటో కింద పడి నాలుగేళ్ల బాలుడు దుర్మరణం చెందిన ఘటన బుధవారం సాయంత్రం మండలంలోని బోయిన్‌పల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బోయిన్‌పల్లికి చెందిన సలావుద్దీన్(లడ్డు), యాస్మిన్‌ల చిన్న కుమారుడు రెహాన్. మినరల్ వాటర్ సరఫరా చేసే ఆటోను డ్రైవర్ రివర్స్ తీస్తున్నాడు. బాలుడు వెనుకవైపు నుంచి రావడంతో డ్రైవర్ గమనించకపోవడంతో దాని కింద పడ్డాడు. బాలుడికి తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈసంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. కుమారుడి మృతితో తల్లిదండ్రుల రోదనలు గ్రామస్తులను కంట తడిపెట్టిస్తున్నాయి.

అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

హన్వాడ: మండలంలోని టంకర్ గ్రామానికి చెందిన నాగలక్ష్మి అనే మహిళ బుధవారం 108అంబులెన్స్‌లోనే ప్రసవించింది. పురిటినొప్పులతో ఆమె బాధపడుతుండగా భర్త శివకుమార్ 108కు ఫోన్ చేశాడు. సమాచారం అందుకున్న ఈఎంటీ మహబూబ్‌పాష, పైలెట్ శివశంకర్ టంకర్ గ్రామానికి చేరుకున్నారు. గర్భిణీని స్థానిక ఆస్పత్రికి తరలించే క్రమంలో పురిటినొప్పులు అధికమయ్యాయి. దీంతో 108 వాహనంలోనే ఆమె పండంటి మగబిడ్డను జన్మనిచ్చింది. తల్లిబిడ్డ ఇద్దరినీ వారు క్షేమంగా హన్వాడలోని పీహెచ్‌సీకి తరలించారు.

వైద్యుడి నిర్లక్ష్యంతో గర్భిణి మృతి

- ప్రధాన రహదారిపై బంధువుల ఆందోళన



రాములమ్మ (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: వైద్యుడి నిర్లక్ష్యంతో ఓ గర్భిణి మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో బుధవారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు... తెల్కపల్లి మండలం ఆలేరుకి చెందిన రాములమ్మ(26) మూడు నెలల గర్భిణీ. తిమ్మిర్లతో బాధపడుతూ నాగర్‌కర్నూల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చింది. ఆమెను ఆస్పత్రిలో చేర్చుకుని వైద్యుడు చికిత్స అందించారు. ఇదేక్రమంలో రాములమ్మ పరిస్థితి విషమించింది. దీంతో మరో ఆస్పత్రికి రెఫర్ చేయగా ఆమె మృతిచెందింది. ప్రైవేటు ఆస్పత్రి వైద్యుడి నిర్లక్ష్యంతోనే గర్భిణీ మృతిచెందిందని బాధిత కుటుంబసభ్యులు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు ప్రధానరహదారిపై నిరసన చేపట్టారు. వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సై గోవర్ధన్ సంఘటనాస్థలికి చేరుకొని బాధితులకు న్యాయం చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. ఈ ఘటనకు సంబంధించి ప్రైవేటు ఆస్పత్రి వైద్యుడిని వివరణ కోరగా గర్భిణీకి బీపీ సమస్య రావడంతో బీపీకి చికిత్స అందించామన్నారు. ఇదేక్రమంలో షుగర్ లెవల్స్ ఎక్కువ కావడంతో మెరుగైన వైద్యం కోసం వేరే ఆస్పత్రికి రెఫర్ చేశామని, ఎలాంటి నిర్లక్ష్యం వహించలేదని ఆయన తెలిపారు.





ఆభరణాల పెట్టె ఊరేగింపు.. చిన్నారుల కర్ర విన్యాసాలు.. అయ్యప్పకొండపై మహాపడి పూజలో పాల్గొన్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మార్మోగిన అయ్యప్ప శరణుఘోష



రాములవారి భారీ విగ్రహం



- పాలమూరులో అయ్యప్పకొండపై మహాపడి పూజ
- పట్టణంలో ఊరేగిన హరిహర సుతుడు

స్టేషన్ మహబూబ్‌నగర్: అయ్యప్పస్వామి శరణుఘోషతో పాలమూరు పులకించింది. అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్పకొండపై మహాపడి పూజ నిర్వహించారు. ఉదయం తూర్పు కమాన్ రామాలయం నుంచి అయ్యప్ప పల్లకీతో పాటు రథం, పూర్ణకలశం, స్వామివారి ఆభరణాలతో భక్తులు శోభాయాత్ర చేపట్టారు. గడియారం చౌరస్తా, క్లాక్‌టవర్, అశోక్‌టాకీస్ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, న్యూటౌన్, మెట్టుగడ్డ, పద్మావతి కాలనీ మీదుగా దేవాలయం వరకు కొనసాగిన శోభాయాత్రలో ఆద్యంతం అయ్యప్ప మాలధారులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

అయ్యప్ప నామస్మరణతో పట్టణం మార్మోగింది. శోభాయాత్రలో ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ తదితరులు పాల్గొని అయ్యప్పను దర్శించుకున్నారు.

- శోభాయాత్ర అనంతరం ఆలయంలో స్వామి వారికి అష్టాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. ఉదయం గణపతి, నవగ్రహ హోమాలు, నిత్యాభిషేకం, సహస్రనామార్చనలు చేశారు. రాత్రి తిరుపతికి చెందిన వెంకటేశ్వర చంద్రమౌళీ శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి చందనం, పంచామృతాలతో అభిషేకాలు, ఏకశిల దివ్య పదునెట్టాంబడి పూజ, మహా మంగళ హారతి నిర్వహించారు. కార్యక్రమా ల్లో అయ్యప్ప సేవా సమాజం అధ్యక్షుడు సీఆర్ భగవంతరావు, ప్రధాన కార్యదర్శి ముత్యంస్వామి, పంబరాజు. మాల్యాద్రిరెడ్డి, హన్మేష్ పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

అయ్యప్పకొండపై మహా పడిపూజ సందర్భంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని అయ్యప్పసేవా సమాజం అధ్యక్షుడు భగవంతురావు, న్యాయవాది మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. శిబిరంలో 338 మంది భక్తులు రక్తదానం చేసినట్లు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ లయన్ నటరాజ్ తెలిపారు.



పూజలో పాల్గొన్న భక్తజన సందోహం



అయ్యప్ప కొండపై రక్తదానం చేస్తున్న భక్తులు



మహాపడి పూజ నిర్వహిస్తున్న స్వాములు

గద్వాలలో ఇరువర్గాల ఘర్షణ

- అడ్డుకున్న పోలీసులపై దాడి



కొత్తబస్టాండ్ ఎదుట ఘర్షణ పడుతున్న ఇరువర్గాల వారు

గద్వాల: భార్యాభర్తలు కలిసి వెళ్తున్న బైక్‌ను వెనకాల మరో ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా.. ఇరువర్గాల ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో అడ్డుకునే ప్రయత్నం చేసిన పోలీసులపై దాడికి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి 10 గంటల సమయంలో గద్వాల పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలిలా.. పట్టణంలోని చింతలపేటకు చెందిన భార్యాభర్తలు శివన్న, సిద్దమ్మ బైక్‌పైన కొత్తబస్టాండు ప్రాంతంలో వెళ్తుండగా అదే మార్గంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ యువకుడు వెనకాల నుంచి వీరిని ఢీకొట్టాడు. దీంతో ఇద్దరు కిందపడటంతో గాయాలయ్యాయి. ఈ క్రమంలో శివన్న జరిగిన ప్రమాదంపై తన కుమారుడు నరేష్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా.. ఘటనా స్థలానికి చేరుకున్న నరేష్ సదరు యువకుడితో గొడవకు దిగి దాడి చేశాడు. దీంతో దెబ్బలు తిన్న సదరు యువకుడు సైతం తమ వారికి ఫోన్ ద్వారా తెలియజేయడంతో.. యువకుడి కుటుంబ సభ్యులు సుమారు 20 మంది వరకు వచ్చి నరేష్‌పై దాడికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న బ్లూకోర్ట్స్ పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఘర్షణకు పాల్పడుతున్న వారిని నిలువరించే ప్రయత్నం చేయగా.. పోలీసులపై కూడా దాడికి పాల్పడ్డారు. పరిస్థితి చేయి దాటిపోవడంతో పోలీసులు విషయాన్ని ఎస్ఐ కల్యాణ్ కుమార్ సమాచారం ఇవ్వగా వారు వచ్చి అడ్డుకున్నారు. అయితే అప్పటి వరకు నరేష్‌పై దాడికి పాల్పడి వారు వెంటనే అక్కడి నుంచి పరారవగా.. ముగ్గురిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. గాయపడిన శివన్న, సిద్దమ్మ, నరేష్‌లను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్ఐ స్పందిస్తూ.. సీసీ పుటేజీల ద్వారా ఆధారాలు సేకరించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు

- పెద్దచెరువు వద్ద మళ్లింపు కాల్వకు చేరుతున్న వైనం
- పట్టణంలోని ఓపెన్ నాలాల నుంచి కొట్టుకొస్తున్న తీరు
- నిత్యం క్వింటాల్ మేర తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది



తొలగిస్తున్న ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను ట్రాక్టర్‌లో నింపుతున్న మున్సిపల్ సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి ఓపెన్ నాలాల ద్వారా మురుగుతో పాటు వాడి పడేసిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు కొట్టుకొస్తున్నాయి. ఇవన్నీ పెద్దచెరువు (మినీ ట్యాంక్‌బండ్)లో కలవకుండా గతంలో ఏర్పాటు చేసిన మళ్లింపు కాల్వకు పెద్ద ఎత్తున చేరుతున్నాయి. దీంతో ప్రతినిత్యం అక్కడ క్వింటాల్ మేర పోగయ్యే ఈ ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు తొలగిస్తున్నారు. అలాగే అప్పుడప్పుడు ప్రత్యేక యంత్రాల ద్వారా వెలికి తీస్తున్నారు. అనంతరం వాటిని ట్రాక్టర్లలో నింపి కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్‌లోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఇలా నెలకు కనీసం నాలుగు మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను పంపిస్తున్నా పెద్దచెరువు వద్ద ఎప్పటికప్పుడు పోగవుతూనే ఉన్నాయి.

అవగాహన కల్పిస్తున్నా.. ఫలితం సున్నా!

మహబూబ్‌నగర్ మున్సిపల్ పరిధిలోని 49 వార్డుల్లో స్వచ్ఛ ఆటోలు ఇంటింటికీ వెళ్తున్నా పూర్తిస్థాయిలో ప్రయోజనం దక్కడం లేదు. కొందరు వీటికి తడి, పొడి చెత్తను ఇవ్వకుండా ఎక్కడబడితే అక్కడ బహిరంగ ప్రదేశాలు, ఓపెన్ ప్లాట్లు, మోరీలలో వేసేస్తున్నారు. మరోవైపు నిత్యం మార్నింగ్ వాక్ కోసం బయటకు వెళ్లే వారు సంచులలో తెచ్చి ఆరుబయట పడేస్తున్నారు. ఇలా చేయొద్దని అధికారులు తరచూ అవగాహన కల్పిస్తున్నా ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ విషయమై ఇరువర్గాల మధ్య వాగ్వాదం నడిచిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. దీంతో అన్నిచోట్ల నుంచి చివరకు పెద్దచెరువు వరకు వచ్చి పేరుకుపోతున్నాయి.



పెద్దచెరువు వద్ద మళ్లింపు కాల్వకు పెద్ద ఎత్తున కొట్టుకొచ్చిన ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు.. తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

వరి కొయ్యలు, వ్యర్థాలతో మేలు

- అవగాహన లేక కాల్చివేస్తున్న రైతులు
- భూమిలో సారం తగ్గి పంట దిగుబడిపై ప్రభావం



ఖిల్లాఘనపురంలో వరికొయ్యలు, గడ్డిని పొలంలోనే కాల్చిన దృశ్యం

ఖిల్లాఘనపురం: వరి కొయ్యలు, వ్యర్థాలతో పంటలకు మేలు చేకూరుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రైతులు అవగాహన లేక పంటలను కోసిన వెంటనే వాటిని కాల్చి బూడిద చేస్తున్నారు. వీటిని కాల్చడంతో భూమిలో సారం తగ్గడంతో పంట దిగుబడిపై ప్రభావం చూపే అవకాశముందని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు.

రబీ సాగుకు..

మండలంలో చెరువులు, కుంటల్లో నిండుగా నీళ్లు నిండుగా ఉన్నాయి. కేఎల్ఐ నీళ్లు కూడా వస్తున్నాయి. దీంతో రబీలో ముందుగా వరి నాట్లు వేసుకుని మంచి దిగుబడి సాధించాలనే ఉత్సాహంతో రైతులు రబీలో వరి సాగు చేసేందుకు తుకాలు పోసుకున్నారు. ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు ఇటీవలే కోయడంతో పాటు వరిగడ్డిని తీసుకు వెళ్లేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. వెంటనే కరిగెట్లు చేయడానికి ఇబ్బందిగా ఉందని ఆలోచిస్తున్న రైతులు పొలంలోని వరి కొయ్యలు, గడ్డికి నిప్పు పెట్టి కాల్చుతూ పొలాలను పాడు చేసుకుంటున్నారు.

కొరవడిన అవగాహన..

రైతులు వరి కొయ్యలు, వ్యర్థాలను కాల్చడంతో జరిగే నష్టంపై అవగాహన కొరవడింది. వరి పంటలను ప్రస్తుతం వరికోత మిషన్లతో కోస్తున్నారు. ఈ సమయంలో కోతలు పైకి వేయడంతో కొయ్యలు పెద్దవిగా ఉంటున్నాయి. పొలంలో కోత సమయంలో వచ్చే వ్యర్థాలు పడటం, కొందరు రైతులు గడ్డిని తీసుకోకపోవడంతో కరిగెట్లు చేసేందుకు ఇబ్బందిగా మారుతుందని నిప్పు పెడుతున్నారు. వ్యవసాయాధికారులు ఇప్పటికైనా ఈ అంశంపై రైతులకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

పోషక విలువలు తగ్గిపోతాయి



రైతులు పొలాల్లోని వరి కొయ్యలు, గడ్డిని కాల్చడంతో భూమిలో పోషక విలువలు తగ్గిపోతాయి. భూమిలో ఉండే సూక్ష్మజీవులు, మెగ్నీషియం, క్యాల్షియం పంటలకు మేలు చేస్తుంటాయి. గడ్డిని, వ్యర్థాలను అలాగే కరిగెట్లో కలియదున్నడంతో పంటలకు సేంద్రియ పదార్థం అందుతుంది.

– మల్లయ్య, మండల వ్యవసాయాధికారి, ఖిల్లాఘనపురం

అదృశ్యమైన బాలుడు శవమై తేలాడు..



అఖిల్ (ఫైల్)

చిన్నచింతకుంట: రెండు రోజుల క్రితం ఇంటి వద్ద ఆడుకుంటూ అదృశ్యమైన ఆరేళ్ల బాలుడు గ్రామ సమీపంలోని నీటి గుంతలో శవమై తేలాడు. అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతిచెందిన ఘటన చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆర్.శేఖర్ వివరాల మేరకు.. అమ్మాపూర్‌కు చెందిన వడ్డె దశరథం – శిరీష కుమారుడు అఖిల్ (6) ఈ నెల 23న తమ ఇంటి వద్ద ఆడుకుంటూ అదృశ్యమయ్యాడు. తల్లిదండ్రులు ఎంత వెతికినా బాలుడి ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున గ్రామ సమీపంలోని రాములవారి గుట్ట నీటిగుంతలో శవమై తేలాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించారు. బాలుడి మృతిపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తంచేశారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గొర్రెల దొంగలు అరెస్ట్



మాట్లాడుతున్న మక్తల్ సీఐ చంద్రశేఖర్

మక్తల్: కర్ణాటక నుంచి మక్తల్‌లో పలుచోట్ల గొర్రెలను దొంగతనం చేస్తున్న దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం సీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక యాదవనగర్‌కు చెందిన పెద్దసాబెన్న అక్కడ గొర్రెలను పెట్టుకోగా 15 గొర్రెలను దొంగలు ఎత్తుకెళ్లారు. మరుసటి రోజు తిరుమలయ్యచెరువు సమీపంలో కుర్వ శివలింగప్పకు చెందిన గొర్రెలను దొంగలు దొంగలిస్తుండగా అతడు వారిని వెంబండించగా తప్పించుకున్నారు. పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో వీరు పోలీసులకు చిక్కగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. దొంగతనానికి పాల్పడినది కర్ణాటకకు చెందిన రమ్య అలియాస్ హన్మంతు, బసప్ప అలియాస్ రాథోడ్, కిరప్పచౌహన్ అలియాస్ బీరప్పగా గుర్తించారు. ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి, ఆచారీ, ఏఎస్ఐ శంకరయ్య, పోలీస్ సిబ్బంది శ్రీకాంత్, అశోక్ పాల్గొన్నారు.



నాలుగు తరాల సంబురం

కుటుంబ విలువలు, బంధాలు, బంధుత్వాలు దూరమవుతున్న నేటి కాలంలో ఓ కుటుంబానికి చెందిన నాలుగు తరాల వారు ఒకే చోటకు చేరి అందరికీ ఆదర్శంగా నిలిచారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండల కేంద్రానికి చెందిన చెందిన పాలవాది నారాయణ కొడుకులు, కూతుళ్లు, మనవళ్లు, మనవరాండ్రు ఇలా మొత్తం నాలుగు తరాలకు చెందిన 100 మంది బుధవారం స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో కలుసుకున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్న కుటుంబ సభ్యులంతా ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకొని ఆడి పాడారు. సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఐదు జంటలకు షష్టిపూర్తి కార్యక్రమం నిర్వహించారు. 32 జంటలను శాలువాలతో సత్కరించారు. ఇలాంటి కార్యక్రమాలతో కుటుంబ బంధాలు మెరుగవుతాయని పలువురు అభిప్రాయపడ్డారు.

– ఖిల్లాఘనపురం

క్లుప్తంగా...

9 నుంచి వైకుంఠ ద్వార దర్శనం ఉచిత టోకెన్లు

- జనవరి 10, 11, 12 తేదీలకు 1.20 లక్షల సర్వదర్శనం టోకెన్లు
- జనవరి 9న జారీ...

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి 10 నుంచి 19 వరకు వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి తిరుపతి, తిరుమలలో సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లు జారీ చేయనున్నట్లు టీటీడీ ఈవో శ్యామలరావు వెల్లడించారు. జనవరి 10, 11, 12 తేదీలకు సంబంధించి జనవరి 9న ఉదయం 5 గంటల నుంచి 1.20 లక్షల టోకెన్లు ఇస్తామని, తదుపరి రోజులకు ఏరోజుకారోజు ముందురోజు టోకెన్లు జారీచేస్తామని ఈవో తెలిపారు. ఇందుకోసం తిరుపతి, తిరుమలలో కౌంటర్లు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతిలోని 8 కేంద్రాల్లో 87 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్లు కలుపుకుని మొత్తం 91 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు తమ ఆధార్ కార్డు చూపించి టోకెన్లు పొందాలని, టోకెన్లు పొందిన భక్తులకు ఈసారి వారి ఫొటో గుర్తింపుతో కూడిన స్లిప్‌లను జారీచేస్తామని తెలిపారు. టోకెన్లు లేని భక్తులకు ఈ 10 రోజుల్లో శ్రీవారి దర్శనం ఉండదని స్పష్టం చేశారు.

టీటీడీకి రూ.1.11 కోట్ల విరాళం అందజేత

తిరుమల: రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఈవో పి.ఎం.ఎస్.ప్రసాద్ బుధవారం టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు ఒక కోటి పదకొండు లక్షల పదకొండు వేల నూట పదకొండు రూపాయలను విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు విరాళం డీడీని టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరికి అందజేశారు.

పోటెత్తిన యాదగిరిగుట్ట



యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. క్రిస్మస్ సెలవు కావడంతో.. జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు భారీగా తరలి వచ్చారు. వర్షంలోనే బారులు తీరారు. ధర్మ దర్శనానికి 4 గంటలు, వీఐపీ దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. శ్రీస్వామి వారిని 45వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులను తీర్చుకున్నారు.



వైఎస్సార్ జిల్లా తాటిరెడ్డిపల్లిలో భారీ జనసందోహం మధ్య వైఎస్ జగన్



జగన్‌కు కేక్ తినిపిస్తున్న తల్లి వైఎస్ విజయమ్మ

నీరా'జనం'

అభిమాన నేతను చూసేందుకు తరలి వచ్చిన పల్లె ప్రజానీకం

తాతిరెడ్డిపల్లె రామాలయం విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న వైఎస్ జగన్

- 30 కిలోమీటర్ల ప్రయాణానికి ఏకంగా 6 గంటల సమయం
- కుటుంబ సభ్యులతో కలిసి పులివెందుల సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు
- పెద్దనాన్న, తల్లితో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసిన మాజీ సీఎం

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లా పులివెందుల–తాతిరెడ్డిపల్లె మార్గంలోని పల్లెల జనమంతా బుధవారం రోడ్డుపైకి వచ్చేశారు.. జై జగన్ అంటూ నినాదాలు చేశారు.. తమ అభిమాన నాయకుడు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ రహదారిలో వెళ్తున్నారని తెలుసుకుని ఆయా గ్రామాల వద్ద రోడ్డుపై తిష్ట వేశారు.. దారి పొడవునా జననేతకు బ్రహ్మరథం పట్టారు. వారి అభిమానానికి ముగ్ధుడైన వైఎస్ జగన్ సైతం ఏ ఒక్కరినీ నిరాశ పరచకుండా అందరినీ పలకరిస్తూ, సెల్ఫీలు దిగుతూ, అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పులివెందుల సీఎస్ఐ చర్చిలో ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం లింగాల మండలం తాతిరెడ్డిపల్లెలో రామాలయం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనేందుకు 11 గంటలకు బయలుదేరారు. అడుగడుగునా అభిమాన జనం పోటెత్తడంతో 30 కిలోమీటర్ల మేర ప్రయాణించేందుకు ఏకంగా ఆరు గంటలు పట్టింది. ప్రతి గ్రామం వద్ద రోడ్డుపైకి వచ్చిన ప్రజలు వైఎస్ జగన్‌ను చూసేందుకు ఎగబడ్డారు. ఆయనతో మాట్లాడటానికి, కరచాలనం చేయడానికి పోటీ పడ్డారు. సాయంత్రం ఐదు గంటలకు ఆలయం వద్దకు వచ్చే సరికి ఆ ప్రాంతం అంతా జనంతో కిక్కిరిసింది. వైఎస్ జగన్‌కు వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు.

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న వైఎస్ జగన్

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బుధవారం క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. పులివెందుల సీఎస్ఐ చర్చిలో వైఎస్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థనలు చేశారు. పెద్దనాన్న వైఎస్ శివప్రకాష్‌రెడ్డి, తల్లి వైఎస్ విజయమ్మ, పెద్దమ్మ వైఎస్ భారతమ్మతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, వైఎస్ ఆనందరెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతీరెడ్డి, వైఎస్ ప్రమీలమ్మ, మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైఎస్ జగన్ 2025 కేలండర్‌ను ఆవిష్కరించారు.

అనంతరం ఆయన కోదండరాముడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విగ్రహ మూర్తులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. కాగా, ఈ ఆలయానికి వైఎస్ జగన్ ప్రభుత్వంలో రూ.34 లక్షలు మంజూరు చేశారు.

పాలనలోనూ కృత్రిమ మేధస్సు!

- 21 ప్రభుత్వ విభాగాల్లో ఏఐ వినియోగానికి ఉన్న అవకాశాలపై మదింపు
- ఐటీ శాఖ పరిధిలోని 'ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్'కు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర సర్కారు
- అంతర్జాతీయంగా పాలన రంగంలో ఏఐ వినియోగం తీరుపై అధ్యయనం
- ప్రభుత్వ విభాగాల అవసరాలకు సరిపోయే రీతిలో ఏఐ ఆధారిత అప్లికేషన్ల రూపకల్పన
- పాలనలో ఏఐ వినియోగంపై ఉద్యోగులకు అవగాహన, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వ పాలన, ప్రజాసేవల్లో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌– ఏఐ)ను మేళవించి ప్రజలకు త్వరితగతిన, సమర్థవంగా సేవలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సమాచార సాంకేతిక (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) రంగంలో వేగంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవడంలో ప్రభుత్వ శాఖలు వెనుకంజలో ఉన్నాయనే విమర్శల నుంచి బయటపడేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. వివిధ ప్రభుత్వ శాఖల్లో కృత్రిమ మేధ వినియోగానికి ఉన్న అవకాశాలపై కసరత్తు చేస్తోంది. ప్రయోగాత్మకంగా కొన్ని ప్రభుత్వ శాఖల్లో ఏఐ వినియోగంతో కూడిన అప్లికేషన్లు (యాప్‌లు) ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ బాధ్యతను ఐటీ శాఖకు అనుబంధంగా ఉన్న 'ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్'కు అప్పగించింది.

21 ప్రభుత్వ శాఖలతో వర్క్‌షాప్

సాంకేతికత వినియోగం ద్వారా పేదరిక నిర్మూలనకు అవసరమైన విధానాల రూపకల్పనలో పేరొందిన 'జేపీఏఎల్'(జమీల్ పావర్టీ యాక్షన్ లాబ్) రాష్ట్ర పాలనలో ఏఐ వినియోగం విషయంలో ప్రభుత్వంతో జట్టుకట్టింది. ఇటీవల 21 ప్రభుత్వ శాఖలకు చెందిన 'ఏఐ నోడల్ ఆఫీసర్ల'తో వర్క్‌షాప్ నిర్వహించింది. ఆయా ప్రభుత్వ విభాగాల పరిధిలోని సంక్లిష్ట అంశాలకు ఏఐ ద్వారా ఏ తరహాలో పరిష్కారాలు సాధ్యమనే కోణంలో లోతుగా మదింపు చేశారు. అంతర్జాతీయంగా పాలన, ప్రజాసేవలో ఏఐ ప్రభావం, వినియోగం, వివిధ దేశాలు, రాష్ట్రాలు ఏఐని వినియోగిస్తున్న తీరుపై ఈ వర్క్‌షాప్‌లో నోడల్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు.

ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా..

వివిధ ప్రభుత్వ శాఖల అవసరాలకు తగిన ఏఐ ఆధారిత యాప్‌లు, ఏ ప్రభుత్వ విభాగానికి ఏ తరహా యాప్‌లు అవసరమనే కోణంలో ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ కసరత్తు చేస్తోంది. ఆయా ప్రభుత్వ విభాగాల్లోని ఉద్యోగులకు కూడా ఏఐ పాలనలో ఏఐ వినియోగంపై అవగాహన కల్పించి, నైపుణ్య శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ శాఖల్లో దశలవారీగా ఏఐ సాంకేతికత వినియోగాన్ని పెంచేలా ఒక రోడ్‌మ్యాప్ రూపొందించే అంశంపై జేపీఏఎల్, ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ కలసి పనిచేస్తున్నాయి.

ఇప్పటికే పలు యాప్‌లు అందుబాటులోకి..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఇటీవల ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆ విజయోత్సవాల్లో భాగంగా రైతులు, యువత, మహిళలు లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం 3 ఐటీ, ఏఐ ఆధారిత అప్లికేషన్లను విడుదల చేసింది. మరో అప్లికేషన్‌ను ప్రభుత్వమే వినియోగిస్తోంది.

- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, అగ్రికల్చర్ డేటా ఎక్స్చేంజీ సంయుక్తంగా ఒక అప్లికేషన్ రూపొందించాయి. వేగంగా డేటా మార్పిడి, వ్యవసాయ ఆవిష్కరణలను ఈ యాప్ వేగవంతం చేస్తుంది. రైతులు రూ.లక్షలోపు రుణాలను గతంలో మాదిరిగా వారాల తరబడి కాకుండా రెండు రోజుల వ్యవధిలోనే పొందడం సాధ్యమవుతుంది.
- తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో 'దిమిత్ర'పేరిట ఏఐ ఆధారిత యాప్‌ను రూపొందించింది. పిల్లల్లో మాదక ద్రవ్యాల వినియోగాన్ని ప్రాథమిక స్థాయిలోనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పసిగట్టేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుంది. మాదక ద్రవ్య రహిత వాతావరణంలో పిల్లలు పెరిగేలా ఈ యాప్ తోడ్పడుతుంది.
- గ్రామీణ మహిళల్లో డిజిటల్ అక్షరాస్యత పెంపు కోసం 'సన్మతి'యాప్ రూపొందించారు. ఏఐ వినియోగంపై సాధారణ పౌరుల్లో అవగాహన పెంచడంలోనూ ఈ యాప్ సాయపడుతుంది.
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, పథకం అమలు కోసం రూపొందించిన 'ఇందిరమ్మ యాప్'తో ప్రస్తుతం లబ్ధిదారుల పరిశీలన జరుగుతోంది. భవిష్యత్తులో ఈ యాప్ ఇందిరమ్మ ఇళ్ల పథకం అమల్లో కీలకంగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నాం

జేపీఏఎల్ సహకారంతో ప్రభుత్వ శాఖల్లో ఏఐ వినియోగంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో అనేక ప్రతిపాదనలు అందాయి. ఏయే విభాగాల్లో ఏయే అంశాల్లో ఏఐ వినియోగం సాధ్యమవుతుందో పరిశీలిస్తున్నాం. 21 ప్రభుత్వ శాఖల నుంచి ప్రతిపాదనలు అందినా తొలిదశలో ఐదు శాఖలను ఎంపిక చేసి ఏఐ ఆధారిత అప్లికేషన్లు తయారు చేయాలని భావిస్తున్నాం. త్వరలో సంబంధిత శాఖల ముఖ్య కార్యదర్శులతో ఈ అంశంపై ప్రత్యేక సమావేశం జరుగుతుంది.

– రమాదేవి లంకా,
డైరెక్టర్, ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్



శ్రీవారిసేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల: సుప్రీంకోర్టు న్యాయమూర్తి హృషికేష్ రాయ్ బుధవారం రాత్రి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన్ని రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా.. అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

7న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల: తిరుమలలో జనవరి 10 నుంచి 19 వరకు పది రోజుల వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాలను పురస్కరించుకుని జనవరి 7 మంగళవారం తిరుమల ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. జనవరి 7వ ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఈ ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా బ్రేక్ దర్శనాలు రద్దు చేయడంతో 6న సిఫార్సు లేఖలు స్వీకరించరు.

పంప్‌మోడ్ పద్ధతిలో 6,556 క్యూసెక్కులు తరలింపు

దోమలపెంట/ మదనాపురం: భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో 24 గంటల వ్యవధిలో శ్రీశైలం ఆనకట్ట దిగువన నాగార్జునసాగర్ జలాశయం నుంచి ఆనకట్ట ఎగువన శ్రీశైలం జలాశయంలోకి 6,556 క్యూసెక్కుల నీటిని (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్ఎస్ఎస్‌కు 1,590, ముచ్చుమర్రి నుంచి కేసీ కెనాల్‌కు 245, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 3.860 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. బుధవారం శ్రీశైలం జలాశయంలో 862.2 అడుగుల వద్ద 112.7164 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

రామన్‌పాడులో 1,021 అడుగులు..

మదనాపురం మండలంలోని రామన్‌పాడులో బుధవారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వల ద్వారా నీటి విడుదల నిలిపివేశారు. దీంతో రామన్‌పాడులోని ఎన్టీఆర్ కాల్వ ద్వారా 820 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదిలామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

రాష్ట్రస్థాయి ఆర్చరీలో బంగారు పతకం



రమావత్ రవి

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని కొల్లూర్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఆర్చరీ పోటీల్లో జిల్లా క్రీడాకారుడు రమావత్ రవి మెరుగైన ప్రతిభ కనబరిచాడు. ఈ పోటీల్లో ఇండియన్ రౌండ్‌లో క్రీడాకారుడు బంగారు పతకం సాధించి రాజస్తాన్ రాష్ట్రం జైపూర్‌లో జనవరి 2 నుంచి 7వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి సబ్ జూనియర్ ఆర్చరీ పోటీలకు ఎంపికయ్యాడు.

వంతెన కష్టాలు

చేగుంట రైల్వేస్టేషన్‌లో నిర్మాణానికి నోచుకోని ఫుట్ ఓవర్ బ్రిడ్జి



చేగుంట రైల్వేస్టేషన్‌లో పట్టాలు దాటుతున్న విద్యార్థులు

- ప్రమాదకరంగా పట్టాలు దాటుతున్న విద్యార్థులు, ప్రయాణికులు
- అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికుల ఆరోపణ

కృష్ణా: మండలంలోని చేగుంట రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ వంతెన లేక ప్రయాణికులు, విద్యార్థులు నిత్యం ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పట్టాలు దాటుతున్నారు. ఈ స్టేషన్‌లో రెండు ప్లాట్‌ఫామ్‌లు ఉండగా.. అటు రాయచూర్, ఇటు గుల్బర్గా, యాద్గిర్‌కు ప్రయాణికులు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రయాణికులు అటు, ఇటు వచ్చిపోయేందుకు ఫుట్ ఓవర్ వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో రైళ్లు లేని సమయంలో పట్టాలు దాటుతున్నారు. రైలు వస్తుండగానే పట్టాలు దాటుతూ పలుమార్లు ప్రయాణికులు, విద్యార్థులు ప్రమాదాలకు గురైన ఘటనలూ ఉన్నాయి.

- మండలంలోని చేగుంట, ఐనాపూర్, అడవి ఖానాపూర్, సూకూర్‌లింగంపల్లి, కర్ణాటకలోని బాడియాల్, కడెచూర్ గ్రామాలకు చెందిన విద్యార్థులు నిత్యం ఉన్నత చదువులకుగాను రైళ్లలో రాయచూర్, యాద్గిర్‌కు వెళ్లి సాయంత్రం స్వగ్రామాలకు వస్తుంటారు. రైలు ఎక్కేందుకు పట్టాలు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్టేషన్‌లో ఉన్న రెండు ప్లాట్‌ఫామ్‌లను కలుపుతూ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే ఇబ్బందులు తొలగుతాయని ప్రయాణికులు అంటున్నారు. ఈ విషయంపై పలుమార్లు రైల్వే ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని, జిల్లా ఉన్నతాధికారులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గూడ్స్ రైలు కిందనుంచి ఇటువైపు వచ్చిన ప్రయాణికులు

భయంగా పట్టాలు దాటుతున్నాం..



రోజు రైలులో కర్ణాటకలోని రాయచూర్‌కు వెళ్తాం. రైలు ఏ ప్లాట్‌ఫామ్‌పైకి వస్తుందో తెలియదు. గ్రామం వైపు ఉన్న ప్లాట్ ఫామ్‌కు వస్తే ఇబ్బంది ఉండదు. ఒక్కోసారి అటుగా ఉన్న ప్లాట్‌ఫామ్‌పైకి వస్తే పట్టాలపై నడుచుకుంటూ దాటాల్సి వస్తోంది. ఆ సమయంలో భయం భయంగానే అటు వెళ్తాం.

–సరస్వతి, విద్యార్థిని, చేగుంట

ప్రమాదమని తెలిసినా..



నిత్యం కళాశాలకు వెళ్లే సమయంలో, ఇంటికొచ్చే సమయంలో పట్టాలపై నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుంది. ఒక్కోసారి కాళ్లకు రాళ్లు గుచ్చుకొని పట్టాలపై పడిపోతాం. ఇలా చాలాసార్లు, చాలా మంది విద్యార్థులు గాయాల పాలయ్యారు. మా ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉంది.

– ప్రియ, విద్యార్థిని, చేగుంట

గూడ్స్ రైళ్లు అడ్డుగా ఉంటున్నాయి..



మేము ట్రేన్ ఎక్కాలంటే అటువైపు ఉన్న ప్లాట్‌ఫామ్ పైకి చేరుకోవాలి. అప్పుడప్పుడు మధ్యలో గూడ్స్ రైలు నిలబడితే తప్పని పరిస్థితుల్లో కిందనుంచి దాటాల్సి వస్తోంది. ఆ సమయంలో దుస్తులకు ఆయిల్ అంటడం, బొగ్గుధూళి, సిమెంట్ పడటంతో పాడవుతున్నాయి. ఇనుపరాడ్లు గుచ్చుకొని గాయాలవుతున్నాయి. – ఉషా పాటిల్, విద్యార్థిని, చేగుంట

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి..



చేగుంట రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి. నిత్యం వందలాది మంది ప్రయాణికులు తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పట్టాలు దాటుతున్నారు. వృద్ధులు, చిన్నారులు రైలు కిందనుంచి దాటుతూ ఇబ్బందులకు గురవుతుంటారు. సమస్యను ఉన్నతాధికారులు త్వరగా పరిష్కరించాలి. లేని పక్షంలో అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ఆందోళన చేపడుతాం.

– సిద్ధు గంటిమఠ, యువకుడు, చేగుంట

ముగింపు దశకు జాతీయ వాలీబాల్ పోటీలు



సెమీ ఫైనల్‌లో తలపడుతున్న సీబీఎస్ఈ–ఉత్తరప్రదేశ్ జట్లు

- నేటి పోటీల అనంతరం జట్టు ప్రకటన

కోస్గి: పట్టణంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న 68వ ఎస్‌జీఎఫ్ అండర్–19 జాతీయ వాలీబాల్ పోటీలు ముగింపు దశకు చేరుకున్నాయి. గురువారం జరిగే ఫైనల్ మ్యాచ్‌లో విజేతలతో పాటు జాతీయ అండర్–19 వాలీబాల్ జట్టును ప్రకటించనున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకుడు పాపిరెడ్డి తెలిపారు.

హోరాహోరీగా సాగిన పోటీలు..

4వ రోజు సెమీ ఫైనల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. 8 జట్లు పోటీల్లో పాల్గొనగా నాలుగు జట్లు ఫైనల్‌కు చేరాయి. బుధవారం జరిగిన పోటీలో గుజరాత్ జట్టు హర్యానా జట్టుపై 22–25, 23–25, 25–20, 25–21, 15–12 స్కోర్‌తో విజయం సాధించింది. అలాగే ఉత్తరప్రదేశ్ జట్టు కర్ణాటక జట్టుపై 23–25, 25–17, 25–19, 26–24తో, రాజస్థాన్ జట్టు మహారాష్ట్ర జట్టుపై 17–25, 20–25, 25–20, 25–17, 15–12తో, సీబీఎస్ఈ జట్టు తమిళనాడు జట్టుపై 25–17, 25–23, 25–19 స్కోర్‌తో విజయం సాధించాయి. గురువారం గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, సీబీఎస్ఈ జట్ల మధ్య తుది పోరుతో పాటు మూడో విజేత జట్టు పోటీలు జరగనున్నాయి.

సనాతన ధర్మాన్ని కాపాడుదాం



సందేశం ఇస్తున్న ఆదిత్య పరాశ్రీ స్వామి

దేవరకద్ర: ప్రతి ఒక్కరూ సనాతన ధర్మానికి కట్టుబడి ఉండాలని అంబత్రయ త్రిశక్తి పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ స్వామి కోరారు. బుధవారం పట్టణంలోని దళితవాడ సమీపంలో జరిగిన అయ్యప్ప పడిపూజ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మన దేశంలోని ప్రతి ఒక్క సాధువు, సంధువు, మఠాధిపతి, పీఠాధిపతి కోరేది ప్రజలు బాగుండాలి.. సనాతన బంధువులు బాగుండాలని కోరుకుంటారని తెలిపారు. ప్రపంచానికే జ్ఞాన భిక్ష పెట్టింది హిందువని.. సౌర కుటుంబంలోని గ్రహాలను లెక్కించే జ్ఞాన సంపన్నులు, తిథులు, రోజులు, మాసాలు, సంవత్సరాలను గణించడం, గ్రహణాలు, విపత్తులు ఎప్పుడు వస్తాయో ముందుగానే తెలుసుకునే జ్ఞానం ఆనాడే మనకుందని వివరించారు. మనమందరం ఏదో ఆశించి కులాలు, మతాలు, ప్రాంతాలు, వర్గాలని విడిపోతున్నామని.. దీన్ని ఆసరా చేసుకొని శత్రువులు నోరు తెరుచుకొని మనను కబళించడానికి పొంచి ఉన్నారనే విషయం గ్రహించాలని సూచించారు. రాజకీయ ఉచ్చు నుంచి బయటకు వచ్చి కులాన్ని ఇల్లు, గడప, కుటుంబం వరకే పరిమితం చేయాలని.. ప్రాంతాలను కలుపుకొని ఐకమత్యంతో సనాతన ధర్మానికి లోబడి ఉండాలని కోరారు. దేవరకద్రను ఆధ్యాత్మిక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి దత్తత తీసుకుంటున్నామని ప్రకటించారు. ఇక్కడి ప్రజలు తనను నేరుగా కలిసి వ్యక్తిగత సమస్యలు, ఆధ్యాత్మిక విషయాల గురించి చెప్పే హక్కు ఇస్తున్నామని వివరించారు. సుభిక్షంగా ఉండటానికి ప్రతి గ్రామంలో హోమాలు నిర్వహించాలనే లక్ష్యంతో ఉన్నానని.. ధనవంతులు, గొప్పవారికే పరిమితమైన వీటిని పేదల ముంగిట కూడా జరపాలన్నదే తమ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో కరణం రాజు, బాలరాజు, ఉస్కిల్ల వెంకట్రాములు, దొబ్బలి అంజనేయులు, రామస్వామి, అంబేడ్కర్, బాలరాజు, చెన్నప్ప, జట్టి నర్సింహారెడ్డి, శ్రీకాంత్ యాదవ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సుదర్శన్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

దేశంలో అసమానతలను రూపుమాపాలి

మహబూబ్‌నగర్ రూరల్: దేశంలో అసమానతలకు కారణమైన మనుస్మృతి ప్రతులను బహుజన మహనీయుల శోభాయాత్ర ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాతపాలమూరు జైభీమ్ చౌరస్తాలో బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు పాతూరి రమేష్, సింగిరెడ్డి పరమేశ్వర్, డాక్టర్ నాగయ్య, మాజీ ఎంపీటీసీ వెంకట్రాములు, రాజుభాయ్ మాట్లాడుతూ దేశంలో అసమానతలను రూపుమాపాలన్నారు. మెజారిటీ ప్రజల హక్కులను దోచుకుని మైనారిటీ జనం సుఖభోగాలను అనుభవించడానికి మనుస్మృతి అమల్లోకి వచ్చిందన్నారు. మనుస్మృతి దళితులు, మహిళల హక్కులు హరించిందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ మనుస్మృతి అమలు చేస్తుందని, రాజ్యాంగం దృష్టిలో పౌరులందరూ సమానమే కానీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు, మహిళలపై దాడులు, హత్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. అన్నివర్గాల ప్రజల అభివృద్ధికి మనుధర్మశాస్త్రం ఆటంకంగా ఉందని ఆనాడు అంబేద్కర్ దాని ప్రతులను దహనం చేశారని గుర్తుచేశారు. స్త్రీని తక్కువ చేసి చూపించే భావజాలాన్ని పెంపొందించింది మనుధర్మమేనని విమర్శించారు. నేటికీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కుల వివక్ష దాడులు, మహిళలపై అత్యాచారాలు, పేదలపై దాడులు పెరిగాయన్నారు. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని మండిపడ్డారు. కౌన్సిలర్ శ్రీనివాసులు, దినేష్, యాదగిరి, శ్రీకాంత్, నరేందర్, నాగరాజు, కృష్ణ, మహేష్, చిన్న రంగయ్య, నర్సింహులు పాల్గొన్నారు.



జైభీమ్ చౌరస్తాలో మనుస్మృతి ప్రతులను దహనం చేస్తున్న నాయకులు